


# కరపత్రం

SINCE 2014

గురువారం జూన్ 5 2025 | సంపుటి :0 | సంచిక :231 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4

# ఇథనాల్ కంపెనీని వ్యతిరేకిస్తూ ఆందోళన

- కంపెనీ కార్లు, టెంట్లు దగ్ధం చేసిన రైతులు
- గద్వాల జిల్లా ధన్వాడలో తీవ్ర ఉద్రిక్తత

ఇథనాల్ కంపెనీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ.. ప్రజలు ఆందోళనకు దిగడంతో గద్వాల జిల్లాలో ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది. రాజోలు మండలం పెద్ద ధన్వాడ గ్రామంలో ఇథనాల్ కంపెనీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ పెద్ద సంఖ్యలో రైతులు ఆందోళన చేపట్టారు. గుట్టుచప్పుడు కాకుండా పనులు ప్రారంభించేందుకు కంపెనీ ప్రయత్నించడంతో మళ్లీ రైతులు ఆందోళన బాటపట్టారు. ఈ క్రమంలో పలు గ్రామాలకు చెందిన రైతులు ఫ్యాక్టరీ వ్యతిరేక ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలోనే ఫ్యాక్టరీ పనులను అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. గాయత్రి ఇథనాల్ కంపెనీకి చెందిన కార్లు, టెంట్లను రైతులు ధ్వంసం చేశారు. పరిశ్రమకు చెందిన -టె-ంట్లు-, కం-టైనర్ డబ్బాలకు రైతులు నిప్పు పెట్టారు.కంపెనీ నిర్మాణ పనులు చేయిస్తున్న కూలీలను రైతులు తరిమికొట్టారు. ఆందోళన చేస్తున్న రైతులను అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. రైతులు ఆందోళన చేపట్టనున్నారన్న సమాచారం ముందస్తుగా పోలీసులు సంఘటనా స్థలం పోలీసులు మోహరించినా.. 2లో..



# నాలుగు సంవత్సరాల్లో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు


ఇందిరమ్మ ఇళ్లలో అర్హులందరికీ న్యాయం చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లను మొదటి విడతలో భాగంగా అందజేస్తున్నామని ప్రకటించారు. ఇందిరమ్మ ఇళ్లను ఇస్తున్న తమ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వానికి చిత్తశుద్ధి, పేదవారి పట్ల ప్రేమ అభిమానాలు ఉన్నాయని తెలిపారు. బుధవారం ఖమ్మం జిల్లాలోని ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో గల సత్యనారాయణపురంలో ఇందిరమ్మ లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. వచ్చే నాలుగు సంవత్సరాల్లో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు. పాలేరు నియోజకవర్గంలో ప్రతి ఇంటికి పెద్ద కొడుకుగా ఉండి అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఆడబిడ్డ, తమ్ముడి కళ్లల్లో ఆనందాన్ని చూస్తుంటే భావోద్వేగానికి లోనవుతున్నామని చెప్పారు.



మొదటి విడతలో నాలుగున్నర లక్షల ఇళ్ల నిర్మాణం
లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసిన పొంగులేటి

### తెలంగాణ టెట్ ఎగ్జామ్ షెడ్యూల్ విడుదల..

# ఏ సబ్జెక్ట్ ఎప్పుడంటే..




తెలంగాణ టెట్ 2025 ఎగ్జామ్ షెడ్యూల్ విడుదల చేసింది ప్రభుత్వం... రాష్ట్రవ్యాప్తంగా జూన్ 18 నుంచి 30 వరకు టెట్ పరీక్షలు నిర్వహించనుంది ప్రభుత్వం. ఈ పరీక్షలు రెండు షిఫ్ట్ లలో జరగనున్నాయి. పేపర్ - 1, పేపర్ - 2 గా జరిగే ఈ పరీక్షల కోసం జిల్లాల వారీగా ఎగ్జామ్ డేట్స్, సబ్జెక్టులు కేటాయించింది ప్రభుత్వం. 2లో..

# ఉనికి కోసమే కవిత లేఖ..

## టీ కప్పులో తుపాన్ లాంటిది వాళ్ల లొల్లి: మంత్రి పొన్నం

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత వ్యవహారంపై మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు.

మిగతాది 2లో

# నోరున్న కార్పొరేటర్లకే

## నిధులిచ్చే పద్ధతి మారాలి: ఎంపీ ఈటల

జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా కొనసాగుతోంది.



మిగతాది 2లో

# వేములవాడ కోడెల మృతి దారుణం

ఎర్రగడ్డ ఆస్పత్రిలో ఫుడ్ పాయిజనింగ్
మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు






కాంగ్రెస్ పార్టీకి పాలన చేతగావడం లేదని ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్రంగా విమర్శించారు. వేములవాడలో కోడెల మృతి, ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనలపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాలన చేయడం చేతకావడం లేదని వ్యాఖ్యానించారు. ఎర్రగడ్డ మానసిక రోగులకు తగిన ఆహారం కూడా అందడం లేదని 70 మంది అస్వస్థతకు గురయ్యారని, ఈ విషయంపై ఇప్పటివరకు సీఎం నుంచి ఎలాంటి స్పందన కనిపించలేదని మండిపడ్డారు. 2లో..

### కేసీఆర్‌ను బద్నాం చేసేందుకే

# కాళేశ్వరం కమిషన్

- కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం రాజకీయ దురుద్దేశమేనని కవిత విమర్శించారు.
- కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం అంటే మొత్తం తెలంగాణకు ఇచ్చినట్లే అని పేర్కొన్నారు.
- తెలంగాణ భూములకు నీళ్లు ఇవ్వడమే కేసీఆర్ చేసిన తప్పా అని ప్రశ్నించారు.



మిగతాది 2లో



# భాషా వివాద నేపథ్యం..

## కమల్‌హాసన్ రాజ్యసభ నామినేషన్ వాయిదా

- మక్కల్ నీది మయ్యం పార్టీ అధ్యక్షుడు కమల్‌హాసన్‌కు రాజ్యసభ స్థానానికి వేయాల్సిన నామినేషన్‌ను వాయిదా వేసుకున్నారు.

'థగ్ లైఫ్' సినిమా ఈవెంట్‌లో కన్నడ భాషపై మక్కల్ నీది మయ్యం పార్టీ అధినేత, ప్రముఖ నటుడు కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగిన సంగతి తెలిసిందే. ఈ భాషా వివాదం నేపథ్యంలో ఆయన రాజ్యసభ స్థానానికి నామినేషన్ దాఖలు చేయడాన్ని వాయిదా వేసుకున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. 2లో..

# పాపం, జగన్ ఇంకా నమ్మలేకపోతున్నారు




జూన్ 4- ఏడాది క్రితం ఇదే రోజున తెలుగు ప్రజలు జగన్‌కు వెన్నుపోటు పొడిచిన సంగతి బైటపడింది. మూడు లక్షల కోట్లు గుమ్మరించినా ఇదే రోజున, "నువ్వెవరో మాకు తెలియదు ఫో!" అంటూ ప్రజలు జగన్‌ను అధికారం లోంచి గెంటేశారు. అందుకే ఈ రోజును ఆయన 'వెన్నుపోటు దినం'గా పాటిస్తున్నారు. అలా పాటించాలని రాష్ట్రంలోని అన్ని వయసుల వారికి పిలుపు ఇస్తున్నారు. సంవత్సరమైనా తెలుగువారు చేసిన ద్రోహం తాలూకు మనోవేదన జగన్‌ను వదలడం లేదు. తిన్న ఇంటి వాసాలను లెక్కపెట్టినట్టుగా తాను విదిల్చిన డబ్బుతో తిని, తాగిన జనం తనకు వెన్నుపోటు పొడవడం ఏమిటో జగన్‌కు అర్థం కావడం లేదు. ఓటర్లు తన సొమ్ము తిని తనకే వెన్నుపోటు పొడవడం వెనక చంద్రబాబు, లోకేశ్‌ల కుట్ర ఉందనీ, లేకపోతే 175కి 175 సీట్లూ వచ్చి ఉండేవని జగన్ నమ్ముతున్నారు. అందుకే ఈ కుట్రల్ని తిప్పికొట్టడానికి ఆయన పూనుకున్నారు. "హు! ఇంత విశ్వాసఘాతం ఎక్కడైనా ఉంటుందా?" అంటూ ఆయన తీవ్ర ఆవేదనకు లోనైన సందర్భాలు అనేకం మీడియాలో కూడా వచ్చాయి. జనం డబ్బు వారి మొహాన్నే ఎంత ధారపోశారో..! ఇంతగా తినిపించి, పేకాటలు ఆడించి, పీపాలు తాగించి బదులుగా తనకు ఒక్క ఓటు ముక్క వేస్తారనుకుంటే... చివరకు ఏం చేశారు!? చప్పుడు రాకుండా వెన్నుపోటు పొడిచారు. అంతకుముందు 151 సీట్లు ఇచ్చిన జనమే, 11 సీట్లు విదిల్చారు. అవసరమైనప్పుడు వదిలేసి, ప్రతిపక్షం చంకనెక్కడాన్ని మించిన 'వెన్నుపోటు' మరొకటి ఉంటుందా? "హే.... ప్రభూ! ఏమిటీ దారుణం!" కలికాలం ముగింపునకు వచ్చిందా అన్నట్టు జగన్ ఎంత ఆవేదనకు లోనయ్యారో సజ్జల రామకృష్ణారెడ్డికి తెలుసు, వాళ్ళబ్బాయి చిరంజీవి సజ్జల భార్గవరెడ్డికి తెలుసు. అందుకే చంద్రబాబు నాయుడు మీద, లోకేశ్ మీద, పవన్ కళ్యాణ్ మీద అంత దుర్మార్గమైన వ్యాఖ్యానాలను భార్గవరెడ్డి సోషల్ మీడియాలో పెట్టించింది. పాపం భార్గవరెడ్డి ఆవేదనను అర్థం చేసుకోలేని సుప్రీంకోర్టు "బెయిల్ లేదు.... గియిల్ లేదు" అని కసిరి పారేసింది. ఇక జగన్ అయితే- రాజకీయాల్లో విలువలు లేకుండా పోతున్నాయని బాగా ఫీలయ్యారు. ఇంకా చాలా చాలా అన్నారు. తాను అబద్ధాలు చెప్పలేకపోవటం, అవినీతికి పాల్పడకపోవడం, ప్రజాస్వామిక పద్ధతుల్ని నమ్ముకోవడం వల్ల కూడా ప్రజలు దొంగహామీల వలలో పడి ఇటువంటి తీర్పు ఇచ్చి ఉంటారని సమాధానపడ్డారు. అమ్మలకు, అయ్యలకు, తాతలకు, అవ్వలకు, అక్క చెల్లెమ్మలకు, మావయ్యా అని నోరారా పిలిచే మేనల్లుళ్ళకు, మేనకోడళ్లకు, ప్లీడర్లకు, ఆటోవాలాలకు, ఓటున్న ప్రతి ఒక్కరికీ ఆరారగా, వరి నారుమడి మీద నీరు చల్లినట్టు, డబ్బు పంచుతూన్నందున, తాను 30 ఏళ్ళపాటు అధికారంలో ఉంటానని జగనన్న భావించారు. ఆయన మనోగతం ఎరిగిన తెలుగు జ్యోతిష్యులు కూడా ఉగాదినాడు%-% జగన్ ఏకంగా 12 సంవత్సరాల 8 నెలల 15 రోజుల 11 గంటల 37 నిముషాలు ఈ రాష్ట్రాన్ని సజ్జల రామకృష్ణారెడ్డి నిస్వార్థ సలహాలతో ఏకఛత్రాధిపత్యంగా పాలిస్తారని పంచాంగాల సాక్షిగా వేదాశీర్వాదాలు పలికి, భారీ దక్షిణలు తీసుకొని వెళ్లిపోయారు. ఈ భవిష్యద్దర్శనాల్ని జగనన్న ఒక్కరే కాదు, గుంటూరులో బోరుగడ్డ అనిల్ నమ్మాడు. అమరావతి ప్రాంతంలో నందిగం సురేష్ నమ్మాడు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కాకాణి గోవర్ధనరెడ్డి, ఆళ్ల నాని, కొడాలి నాని, పేర్ని నాని, అంబటి, రజని... ఇంకా చాలామంది నమ్మారు. మాచర్లకు ప్రభువుల లాంటి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బ్రదర్స్ నమ్మారు. కాకినాడలో అనంతబాబూ నమ్మాడు. ఆయన గాడ్ ఫాదరూ నమ్మారు. అలా ముప్ఫయ్ ఏళ్ళ పాటు మన "ప్రజాసేవకు" ఎదురేలేదని మనసా వాచా కర్మణాః నమ్మిన రౌడీలు, కబ్జా కోరులు, రేషన్ బియ్యం దొంగలు, హంతకులు, మోసగాళ్లు, థర్డ్ రేట్ కాంట్రాక్టర్లు, పొలిటికల్ బ్రోకర్ల దురాగతాలను చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్ ఊరూరా తిరిగి టముకు వేశారు. జగన్ పట్టించుకోలేదు. కానీ, జనం పట్టించుకున్నారు. ప్రభుత్వానికి సలహాలు ఇవ్వడంలో విశేషానుభవం గడించిన సజ్జల రామకృష్ణారెడ్డి జనం ఇవన్నీ పట్టించుకుంటారా అంటూ "అంతరంగిక" సలహా ఏమైనా ఇచ్చారేమో తెలియదు గానీ, జగన్ మాత్రం "థర్టీ ఇయర్స్" థియరీకే ఫిక్స్ అయిపోయారు. వీళ్ళను చూసి ఆఫీసర్లూ తయారైపోయారు. "జరుగు... జరుగు..." అంటూ ఇప్పుడు వీళ్ళు కూడా వాళ్ళతో పాటు జైళ్ళ బాట పడుతున్నారు. పాపం జనం వెన్నుపోటు వల్లే కదా ఇంతమందికి ఇన్ని కష్టాలు? ఐదేళ్ళ పాటు జగన్ పంచిన ప్రలోభాలకు లొంగి జనం విశ్వాసం చూపించి ఉంటే%-% చంద్రబాబు, లోకేశ్ ఇప్పుడు ఎక్కడ ఉండేవారు? రఘురామకృష్ణంరాజు పరిస్థితి ఏమిటి? కొడాలి నానికి గుండెపోటు వచ్చేదా? వల్లభనేని వంశీ వెలిసిపోయిన జుట్టుతో ఖళ్ ఖళ్ మని దగ్గుతూ బెజవాడ జైలులో ఉండేవాడా? పుంగనూరు ప్రభువులవారు గానీ, ప్రభుత్వ ప్రధాన 'సలహాదారు'లు గానీ కబ్జా చేసిన భూముల్లోకి కలెక్టర్ అయినా కన్నెత్తి చూసేవారా? ఇప్పుడు రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ సైతం వెళ్ళి, "ఇది ప్రభుత్వ భూమి. బీ కేర్‌ఫుల్" అంటూ బోర్డులు పాతి పెడుతున్నారు. ఫస్ట్ టర్మ్‌లో పోలీస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావును ఆయన సర్వీస్‌లో చివరి ఐదేళ్ళూ అసలు ఉద్యోగంలో లేకుండా చేశారు గానీ, అరెస్ట్ చేసి జైల్లో మాత్రం పెట్టలేకపోయారు. జగన్‌కు అది తీరని కోరికగానే మిగిలిపోయింది. జనం వెన్నుపోటు పొడవకుండా ఉన్నట్టయితే, ఈ టర్మ్‌లో జగన్ కోరిక తీరేది. పిఎస్ఆర్ ఆంజనేయులుకు వెలిసిపోయిన జుట్టుతో కళావిహీనంగా బెజవాడ జైలులో ఉండ వలసిన పరిస్థితి వచ్చేది కాదు.

# ఉనికి కోసమే కవిత లేఖ..

### టీ కప్పులో తుపాన్ లాంటిది వాళ్ల లొల్లి: మంత్రి పొన్నం



మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత వ్యవహారంపై మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. బుధవారం (జూన్ 4) గాంధీభవన్?లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కవిత రాజకీయ ఉనికి ప్రశ్నార్థకంగా మారిందని.. అందుకే ఆమె తన తండ్రి కేసీఆర్ కు లేఖ రాసిందన్నారు. కవిత, బీఆర్ఎస్ పంచాయితీ టీకప్పులో తుపాన్ లాంటిదని ఎద్దేవా చేశారు. వాళ్ళ ఉనికి కోసం రాజకీయంగా దృష్టి మరల్చడానికి మాత్రమే కవిత లెటర్ రాసిందని ఆరోపించారు.

కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలను జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలోని స్వతంత్ర కమిషన్ విచారిస్తున్నదని.. కమిషన్ పిలిస్తే ఎవరైనా విచారణకు రావాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రాజెక్టు పేరుతో నీళ్లు ఇస్తే పర్వాలేదు కానీ.. నీళ్ల పేరుతో బీఆర్ఎస్ నేతలు కమిషన్లు దండుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వం తరుపున ప్రజల సమస్యలు విని పరిష్కారించేందుకు గతంలో గాంధీ భవన్‌లో ముఖాముఖి జరిగిందని.. ఈ కార్యక్రమాన్ని బుధవారం (జూన్ 4) నుంచి పునః ప్రారంభిస్తున్నామని తెలిపారు.

ప్రజాపాలన కావాలని కోరుకున్న ప్రతి కామన్ మెన్?కు గాంధీ భవన్ అందుబాటులో ఉంటుందని అన్నారు. ఇక్కడ వచ్చిన అప్లికేషన్లను ప్రతిష్టాత్మకంగా తీసుకొని పరిష్కారిస్తామన్నారు. మంత్రులను కల్వడానికి ఇబ్బంది కలగొచ్చు కానీ తల్లి లాంటి గాంధీ భవన్ ఎప్పుడు అందుబాటులో ఉంటుందని అన్నారు. గ్రీన్ చానల్ ద్వారా ప్రజల సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇల్లులేని ఊరు, హనుమంతుని గుడి లేని గ్రామం లేదన్నారు. హైదరాబాద్ లో లక్ష రేషన్ కార్డులు ఇచ్చే ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. రాష్ట్రాన్ని ఆర్థిక సమస్యల్లోకి నెట్టిన వారు ఇప్పుడు మనల్ని విమర్శిస్తున్నారని బీఆర్ఎస్?పై ఫైర్ అయ్యారు.

# నోరున్న కార్పొరేటర్లకే

### నిధులిచ్చే పద్ధతి మారాలి: ఎంపీ ఈటల

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా కొనసాగుతోంది. హైదరాబాద్ మహా నగరంలో సమస్యలపై కార్పొరేటర్లు , ఎక్స్అఫిషియో సభ్యులు, మేయర్, డిప్యూటీ మేయర్, అధికారులంతా కలిసి చర్చిస్తున్నారు. ఈ సమావేశంలో వీధి దీపాలు, నాలాల విస్తరణ, వరదల విలయం, ట్రాఫిక్ ఇబ్బందులు సహా పలు అంశాలపై ప్రశ్నలు, సమాధానాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా భాజపా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. నగరంలోని రైల్వే క్రాసింగ్‌ల వద్ద సమస్యలు పరిష్కరించాలని సూచించారు. నోరున్న కార్పొరేటర్లకే నిధులిచ్చే పద్ధతికాకుండా.. పార్టీలతో సంబంధం లేకుండా సమస్యలు ఉన్న అన్ని ప్రాంతాలకు నిధులు కేటాయించాలని కోరారు.

అనంతరం కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ.. మూసీ పునరుజ్జీవంలో కేంద్రం సహకారానికి ఈటల కృషిచేయాలని అడగ్గా.. అభివృద్ధికి తాను ఎప్పుడూ అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశానికి జీహెచ్ఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టాక ఆర్‌వీ కర్ణన్ తొలిసారి హాజరయ్యారు.

# భాషా వివాద నేపథ్యం..

### కమల్‌హాసన్ రాజ్యసభ నామినేషన్ వాయిదా

మొదటిపేజీ తరువాయి

త్వరలో విడుదల కాబోయే తన చిత్రం 'థగ్ లైఫ్' వ్యవహారాలు పూర్తయిన తర్వాతే నామినేషన్ వేయాలని భావిస్తున్నట్లు తెలిపాయి.

కమల్ 2018లో ఎంఎన్ఎం పార్టీని స్థాపించారు. విపక్ష ఇండియా కూటమిలో ఇది భాగం. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తమిళనాడులో డీఎంకే, కాంగ్రెస్ కూటమికి మద్దతు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఒప్పందంలో భాగంగా రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలు, పుదుచ్చేరిలోని ఒక స్థానంలో ఎంఎన్ఎం ప్రచారం చేసింది. 2025 ఎగువసభ ఎన్నికల్లో ఎంఎన్ఎం పార్టీకి రాజ్యసభ స్థానం ఇచ్చేందుకు డీఎంకే నేతృత్వంలోని కూటమి అంగీకరించింది. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో డీఎంకేతో కుదిరిన ఈ ఒప్పందం ప్రకారం ఎంఎన్ఎంకు ఎగువసభ స్థానం కేటాయించారు. దీంతో కమల్ హాసన్ రాజ్యసభకు వెళ్లనున్నారనే విషయాన్ని డీఎంకే-ఎంఎన్ఎం ఇటీవల ఖరారు చేశాయి.

ఇటీవల నిర్వహించిన 'థగ్‌లైఫ్' సినిమా ఈవెంట్‌లో తమిళం నుంచే కన్నడ పుట్టిందని కమల్ వ్యాఖ్యానించడంతో భాషా వివాదం మొదలయ్యింది. కమల్ వ్యాఖ్యలను కన్నడ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో కర్ణాటకలో థగ్‌లైఫ్ చిత్రాన్ని నిషేధించాలని కోరుతూ ఆ రాష్ట్ర ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (కేఎఫ్‌సీసీ) హైకోర్టును ఆశ్రయించింది. ఆ పిటిషన్‌ను మంగళవారం విచారించిన న్యాయస్థానం కమల్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. క్షమాపణ చెబితే అన్నీ పరిష్కారమయ్యేవని వ్యాఖ్యానించింది. దీంతో ఈ చిత్రాన్ని కర్ణాటకలో ప్రస్తుతానికి విడుదల చేయకూడదని కమల్‌హాసన్ నిర్ణయించారు. అనంతరం, తన వ్యాఖ్యలను అపార్థం చేసుకున్నారంటూ 'కేఎఫ్‌సీసీ'కి కమల్ లేఖ రాశారు. అయితే, అందులోనూ సారీ చెప్పకపోవడం గమనార్హం.

# నాలుగు సంవత్సరాల్లో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు

మొదటిపేజీ తరువాయి

పనిచేస్తే వారి నుంచి వచ్చే స్పందన గొప్పగా ఉంటు-ందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేక పోయినా సన్నబియ్యం ఇస్తున్నామని వెల్లడించారు. పది సంవత్సరాల్లో మాజీ సీఎం కేసీఆర్‌కి రేషన్ కార్డులు కూడా ఇవ్వాలనే ఇంగిత జ్ఞానం లేదని ధ్వజమెత్తారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో 19 లక్షల మంది పేర్లను కొత్తగా రేషన్ కార్డులో జమచేశామని ప్రకటించారు. ధనిక తెలంగాణ రాష్ట్రాన్నిగత కేసీఆర్ ప్రభుత్వంలో అప్పుల్లోకి నెట్టారని పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ధనిక రాష్ట్రంలో రూ.8 లక్షల 19 వేల కోట్ల అప్పు చేసి పోతే.. ప్రతి నెల రూ.6,500 కోట్ల వడ్డీని తమ ప్రభుత్వం కడుతూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకుల మాదిరిగా పేదోళ్ల గురించి మొసలి కన్నీరుని ఇందిరమ్మ ప్రభుత్వం కార్చబోదని చెప్పారు. ఇందిరమ్మ ప్రభుత్వం గురించి మాట్లాడే హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. ఊకదంపుడు ఉపన్యాసాలు, కాలయాపన చేసే కబుర్లు చెపితే ప్రజలు నమ్మరని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. గత పది సంవత్సరాల కేసీఆర్ పాలనలో ఆయన కుటు-ంబ సభ్యులు కట్టు-కున్న ప్యాలెస్‌లు, అధికారులు, ప్రజాప్రతినిధులు నివసించే బంగ్లాల మీద పెట్టిన ఖర్చు, శ్రద్ధ పేదవారి ఇంటి మీద ఎందుకు పెట్టలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో రూపాయి ఖర్చు పెడితే రాజకీయంగా ఏం లాభం వస్తోందనే ఆలోచించారని అన్నారు. పేదవారికి ఖర్చు పేటటె- ప్రతి రూపాయి వారికి అందుతుందా లేదా అని కూడా కేసీఆర్ కనీసం ఆలోచించలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు.

# ఇథనాల్ కంపెనీని వ్యతిరేకిస్తూ ఆందోళన

మొదటిపేజీ తరువాయి

రైతులు భారీ సంఖ్యలో ఉండడంతో వారిని పోలీసులు నిలువరించలేకపోయారు. కంపెనీకి చెందిన స్థలంలో ఉన్న వాహనాలను సైతం రైతులు ధ్వంసం చేశారు. మూడు నెలల కిందట కంపెనీ ఉండదని చెప్పిన యాజమాన్యం.. మళ్లీ పనులు మొదలుపెట్టేందుకు ఉపక్రమించడంతో పది గ్రామాల రైతుల ఆందోళన చేపట్టారు. పెద్దధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీ పనులను గుట్టు చప్పుడు కాకుండా కంపెనీ మళ్లీ ప్రారంభించింది. దాంతో మరోసారి రైతులు ఆందోళన చేపట్టారు. ఫ్యాక్టరీ వ్యతిరేక పోరుబాట పట్టడంతో మళ్లీ పెద్ద ధన్వాడ రణరంగంగా మారింది. కంపెనీ పనుల నేపథ్యంలో గ్రామ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పోరాట కమిటీ- సైతం సూచించింది. ఈ క్రమంలో మంగళవారం కీలక ప్రకటన సైతం విడుదల చేసింది. అర్ధరాత్రి ప్రజలంతా నిద్రలో ఉండగా.. దొంగల్లాగా ఇథనాల్ ఫ్యాక్టరీ యాజమాన్యం కం-టె-నర్లు, టిప్పర్లు, హిటాచీలను ప్రైవేటు సైన్యంతో పెద్దధన్వాడలోని నిర్మాణ స్థలంలోకి తీసుకువచ్చినట్లు కమిటీ- పేర్కొంది. గత ఆరునెలలుగా 12 గ్రామాల ప్రజెనై క్యాన్సర్ కారకాలు, విషాన్ని చిమ్మే పెట్టే ఫ్యాక్టరీని నిర్మించొద్దంటూ నిరసన నిరహార దీక్షలు కొనసాగించినట్లు- పేర్కొంది. మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ అలంపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి సంపత్ కుమార్ హామితో దీక్షలు విరమించామని గుర్తు చేసింది. అర్ధరాత్రి దొంగ దెబ్బ తీస్తారని ఊహించలేదని పేర్కొంది. ప్రజలందరూ ఏకతాటిపైకి వచ్చి, శాంతియుతంగా పోరాడుతున్న సమయంలో ప్రజలపై దాడి చేసేందుకు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే దురుద్దేశంతో ప్రైవేట్ సైన్యాన్ని మోహరిస్తూ ఫ్యాక్టరీ యాజమాన్యం ఏం కోరుకుంటుందని.. ప్రజల సహనాన్ని పరీక్షించడం దేనికి సంకేతమని ప్రశ్నించింది.

# వేములవాడ కోడెల మృతి దారుణం

మొదటిపేజీ తరువాయి

వేములవాడలో కోడెల మరణం కొనసాగుతుండగా ప్రభుత్వం స్తంభించినట్లే ఉంది అని వ్యాఖ్యలు చేశారు. అనేక కోడెలు గడ్డి లేక చనిపోతున్నా, ప్రభుత్వం పట్టింపు తీసుకోవడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మాకు బాధ్యత అప్పగిస్తే కోడెలను కాపాడుతాం అని స్పష్టత ఇచ్చారు. ఈ మధ్యే మాపై కేసులు పెట్టడం, కమిషన్లు ఏర్పాటు- చేయడం తప్ప అసలు సమస్యలపై ప్రభుత్వాన్ని పట్టించుకోడం లేదని, నిజమైన ప్రజా సమస్యలను వదిలి మిగతా విషయాల్లో బిజీ అయ్యారని తెలిపారు. ఇక రేపటి కేబినెట్ సమావేశంలో రైతు బంధు డబ్బులను వెంటనే విడుదల చేయాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని తీవ్రంగా పిలుపునిచ్చారు.

### తెలంగాణ టెట్ ఎగ్జామ్ షెడ్యూల్ విడుదల..

# ఏ సబ్జెక్ట్ ఎప్పుడంటే..

మొదటిపేజీ తరువాయి

ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు ఒక షిఫ్ట్, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 :30 గంటల వరకు రెండో షిఫ్ట్ నిర్వహించనున్నారు.

5 వ తరగతి వరకు బోధించాలనుకునే అభ్యర్థులకు పేపర్ 1, ఆరో తరగతి, ఆపై బోధించాలని అనుకునే అభ్యర్థులకు పేపర్ 2 కింద ఎగ్జామ్ నిర్వహించనున్నారు. ఈ పరీక్షలు ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో ఉండగా, కొన్ని సబ్జెక్టులకు హిందీ, కన్నడ, తమిళం, ఉర్దూ, మరాఠీ, బెంగాలీ, సంస్కృతం మాధ్యమాల్లో కూడా ఉండనున్నాయి

పేపర్ 2విభాగంలోని మ్యాథ్స్, సైన్స్ ఎగ్జామ్ తో ప్రారంభమయ్యే ఈ పరీక్షలు వరుసగా 16 సెషన్లలో జరగనున్నాయి. జూన్ 30న మైనారిటీ భాషల్లో జరిగే మాథ్స్, సైన్స్, సోషల్ స్టడీస్, తో పరీక్షలు ముగియనున్నాయి. జిల్లాల వారీగా కేంద్రాలు, సంబంధిత సబ్జెక్టులు, పరీక్షా తేదీల వివరాలు షెడ్యూల్ లో వెల్లడించింది ప్రభుత్వం.నిజామాబాద్, జగిత్యాల, పటాన్చెరు, సంగారెడ్డి నల్గొండ, ఖమ్మం, హైదరాబాద్, వరంగల్, సిరిసిల్ల, మంచిర్యాల, ములుగు, మహబూబ్నగర్, మెదక్ జిల్లాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు షెడ్యూల్లో తెలిపింది ప్రభుత్వం. త్వరలోనే హాల్ టికెట్స్ విడుదల చేస్తామని.. అఫీషియల్ వెబ్ సైటులో డౌన్లోడ్ చేసుకోవచ్చని తెలిపింది ప్రభుత్వం. అభ్యర్థులు షెడ్యూల్ కి అనుగుణంగా తేదీలు గమనించి ఎగ్జామ్స్ కి సిద్ధమవ్వాలని తెలిపింది ప్రభుత్వం.

# కేసీఆర్‌ను బద్నాం చేసేందుకే కాళేశ్వరం కమిషన్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: రాజకీయ దురుద్దేశంతోనే మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారని భారాస ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. నోటీసులను నిరసిస్తూ ఇందిరా పార్క్ వద్ద తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ కేసీఆర్ ఏం తప్పు చేశారని నోటీసులు ఇచ్చారని ప్రశ్నించారు. ఆయనకు ఇచ్చారంటే మొత్తం తెలంగాణకు ఇచ్చినట్లే అని పేర్కొన్నారు. తెలంగాణ భూములకు నీళ్లు ఇవ్వడమే కేసీఆర్ చేసిన తప్పా అని నిలదీశారు.

" అది కాళేశ్వరం కమిషన్ కాదు.. అది కాంగ్రెస్ కమిషన్, రాజకీయ కమిషన్. కాళేశ్వరం పూర్తయితే 35 శాతం తెలంగాణ భూభాగానికి నీళ్లు అందిస్తుంది. కేసీఆర్‌ది గట్టి గుండె కాబట్టి అంత పెద్ద ప్రాజెక్టు నిర్మించారు. దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోంది. కేసీఆర్‌ను బద్నాం చేసేందుకే కాళేశ్వరం కమిషన్ వేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డకు చిన్న చిన్న మరమ్మతులు కూడా చేయట్లేదు. తెలంగాణ నీళ్లను ఏపీ తరలించుకుపోతుంటే సీఎం రేవంత్‌రెడ్డి స్పందించట్లేదు. గోదావరి-పెన్నా అనుసంధానం పేరిట నీళ్ల తరలింపును అడ్డుకోవాలి. భాజపాలో ఉన్న తెలంగాణ బిడ్డ ఈటల రాజేందర్ కూడా మాట్లాడకపోవడం శోచనీయం. గోదావరి-బనకచర్లను ఆపే బాధ్యతను ఆయన తీసుకోవాలి. కాళేశ్వరానికి జాతీయ హోదా తీసుకొచ్చే బాధ్యతను కూడా ఈటల తీసుకోవాలి" అని కవిత అన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
గురువారం జూన్ 5 2025

# కోరుట్లలో ఇకపై రుచుల "అమోఘం"

**కరపత్రం కోరుట్ల టౌన్**




కోరుట్లలో ఈరోజు జూన్ 5 వ తేదీన మరో కొత్త రుచుల రెస్టారెంట్ ప్రారంభం కాబోతున్నది. కోరుట్లలోని రిలయన్స్ మార్ట్ పైన అమోఘం పేరుతో మల్టీ కుజైన్ రెస్టారెంట్ మరియు మినీ బాంక్వెట్ హాల్ ప్రారంభిస్తున్నామని శ్రీ చిరుమల్ల ధనంజయ్ కరపత్రంతో తెలిపారు.
"అమోఘం రెస్టారెంట్" లో వెజిటేరియన్ మరియు నాన్ వెజిటేరియన్ లకు విడిగా రెండు అధునాతన కిచెన్ లు ఏర్పాటు చేశామని అన్నారు.
శాఖాహారులు ముఖ్యంగా అయ్యప్పలు నియమంగా ఆహారాన్ని తీసుకుంటారు. అలాంటి పవిత్ర భావనతో మెలిగే వారి కోసం వెజిటేరియన్ కిచెన్ ఏర్పాటు చేశామని ధనుంజయ్ తెలిపారు.
రెస్టారెంట్ తో పాటు ఒక "మినీ బాంక్వెట్ హాల్" సకల సౌకర్యాలతో ప్రారంభిస్తున్నామని అన్నారు.
ఆరోగ్యకరమైన మరియు శుద్ధమైన ఆహారాన్ని అందించడానికి మా అమోఘం రెస్టారెంట్ సిద్ధం చేశామని అన్నారు.వేడుకలు జరుపుకోవడం ఖర్చుతో కూడుకున్న వ్యవహారం గా మారిందని, తక్కువ ఖర్చుతో చిన్న చిన్న వేడుకలు జరుపుకోవడం కోసం మేము మినీ
బాంక్వెట్ హాల్ ప్రారంభిస్తున్నామని అన్నారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నిజామాబాద్ ఎంపీ శ్రీ ధర్మపురి అరవింద్ గారు, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ శ్రీ కల్వకుంట్ల సంజయ్ గారు మరియు కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ శ్రీ జువ్వాడి నరసింగరావు గారు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి అన్నం లావణ్య అనిల్ గారు మరియు 23వ వార్డు మాజీ కౌన్సిలర్ శ్రీమతి పుప్పాల ఉమా ప్రభాకర్ గారు హాజరవుతున్నారని తెలిపారు.
ఈ కార్యక్రమానికి ప్రజలందరినీ ఆహ్వానిస్తున్నామని, మా ఈ ప్రయత్నాన్ని ప్రోత్సహిస్తున్న మిత్రులు శ్రేయోభిలాషులు బంధువులు అందరికీ ధనంజయ్ కృతజ్ఞతలు తెలియజేశారు
మల్టీ కుసైన్ అంటే బహుళ వంటకాల రెస్టారెంట్ మరియు వేడుకల వేదిక అంటే మినీ బాంక్వెట్ హాల్ ప్రారంభిస్తున్నామని మా ఈ ప్రయత్నం తప్పకుండా ప్రజలను ఆహార ప్రియులను అలరిస్తుందని, ఆనందపరుస్తుందని అన్నారు.
అమోఘం రెస్టారెంట్ మరియు మినీ బాంక్వెట్ హాల్ సౌకర్యాలను ప్రజలందరూ వినియోగించుకొని మమ్మల్ని ప్రోత్సహించాలని, ఆశీర్వదించాలని శ్రీ ధనుంజయ్ అన్నారు.

## కేబుల్ టీవీ ఆపరేటర్లు పోల్ టాక్స్ చెల్లించాల్సిందే



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
మెట్ పల్లి డివిజన్ విధ్యుత్ అధికారి కార్యాలయంలో కేబుల్ టీవీ ఆపరేటర్ లతో బుధవారం విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ గంగారాం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం వ్యాప్తంగా రెండు మున్సిపాలిటీలు, మండల కేంద్రాలు, మేజర్ గ్రామ పంచాయతీలు మరియు అన్ని గ్రామాల్లో విద్యుత్ స్తంభాలను తమ నెట్వర్క్ విస్తరణకు వాడే కేబుల్ టీవీ ఆపరేటర్లు, ఇంటర్నెట్ ప్రొవైడర్లు తప్పనిసరిగా పోల్ టాక్స్ చెల్లించాలన్నారు.

## కోరుట్ల అయ్యప్ప స్వామి గిరిప్రదక్షిణ

**కరపత్రం కోరుట్ల టౌన్**



అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రమైన ఉత్తర నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం కోరుట్ల ఆయప్ప స్వామి మూలమూర్తికి పంచామృతాలతో ఆలయ పురోహితులు పాలేపు రాముశర్మ స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కోరుట్ల, నాగులపేట, సంగెం, కథలాపూర్ నుండి విచ్చేసిన 35 మంది భక్తులు అయ్యప్ప గిరి ప్రదక్షిణ చేశారు. గిరి ప్రదక్షిణ చేయడం ద్వారా బాధలు తొలగి సుఖ సంతోషాలు చేకూరుతాయని తెలిపారు.

## మెట్ పల్లిలో బీజేపీ నాయకుల పరామర్శ



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
మెట్ పల్లి పట్టణంలోని 26వ వార్డ్ బీజేపీ నాయకులు కట్ట శ్రీకాంత్ సోదరుడు కట్ట హరీష్ మంగళవారం మరణించడంతో బుధవారం వారి నివాసానికి వెళ్లి, వారి కుటుంబ సభ్యులను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కోరుట్ల నియోజకవర్గ నాయకులు సురభి నవీన్ కుమార్ పరామర్శించారు. వారితో పాటు బీజేపీ మెట్ పల్లి పట్టణ అధ్యక్షులు బోడ్ల రమేష్, బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

## కోరుట్లలో శ్రీ దుర్గా దేవాలయం తృతీయ వార్షికోత్సవం



**కరపత్రం కోరుట్ల టౌన్**
కోరుట్ల పట్టణంలోని కాలేజీ గ్రౌండ్ వద్ద గల శ్రీ దుర్గా దేవాలయం తృతీయ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారిని బుధవారం దర్శించుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరుట్ల నియోజకవర్గ నాయకులు సురభి నవీన్ కుమార్. వారితోపాటు బీజేపీ నాయకులు, బీజేవైఎం, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

## కేరళ వాసులకు సంఘీభావం తెలిపిన బిజెపి నాయకులు

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి మేడ్చల్**



కేరళకు చెందిన 50 మంది సైకిల్ మోటార్లపై కాశ్మీర్ కు యాత్రగా బయలు దేరారు.పహల్గాం మారణ కాండ అనంతరం భారత్ జరిపిన "ఆపరేషన్ సింధూర్" సక్సెస్ అనంతరం కేరళ నుండి కాశ్మీర్ వరకు భారత దేశం ఒక్కటేనని చాటుతూ ఈ యాత్ర చేపట్టారు. దేశానికి ఏ సవాల్ ఎదురైనా దేశమంతా ఒక్కటిగా నిలుస్తుందని చాటుతూ 50 మంది చేపట్టిన మోటార్ బైక్స్ యాత్ర నిన్న కేసరకు చేరుకున్నది. భారత ప్రజల నిర్భీతిని ప్రదర్శిస్తూ కేరళ సముద్ర తీరం నుండి కాశ్మీర్ లోని ఎల్ ఓ సి సరిహద్దుల వరకు ఎలాంటి ఆపద లేదని చాటుతూ చేపట్టిన యాత్ర నిన్న కీసరకు చేరుకున్నది.ఈ భారత వీర యాత్రీకులు కీసర మీదుగా కాశ్మీర్ కు వెళు తున్న సందర్భం పురస్కరించుకుని బిజెపి నాయకులు స్వాగతం పలికి సంఘీభావం ప్రకటించారు.యాత్రీకులకు తగిన ఆహార పదార్థాలు నీళ్లు అందించి ఆదరించినందుకు కేరళ వాసులైన యాత్రీకులు బిజెపి నాయకుల కార్యకర్తల ఆదరణకు కృతజ్ఞతలు తెలియ జేసారు.

## వాటర్ ట్యాంకులను శుభ్రం చేసి బ్లీచింగ్ వేయాలి



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
మెట్‌పల్లి పట్టణంలో బుధవారం 100 రోజుల ప్రణాళికలో భాగంగా మున్సిపల్ కమిషనర్ టి మోహన్ పట్టణంలోని త్రాగునీటి ఫిల్టర్ బెడ్ వద్ద త్రాగునీరు క్లోరినేషన్ శాతాన్ని పరిశీలించారు.
ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ టీ మోహన్ మాట్లాడుతూ పట్టణంలోని తాగునీటి ఫిల్టర్ బెడ్ వద్ద తాగునీటి క్లోరినేషన్ శాతాన్ని పరిశీలించడం జరిగిందని, ప్రతి 15 రోజులకు ఒకసారి వాటర్ ట్యాంకులను శుభ్రం చేసి బ్లీచింగ్ వేయాలని సిబ్బందికి ఆదేశించారు.


## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ భూమి పూజ



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి మేడ్చల్**
మేడ్చల్ నియోజకవర్గం, మూడుచింతలపల్లి మున్సిపాలిటీలోని, ఉద్ధమర్రి గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారులు రంగు లావణ్య, దేగదుల ఇంద్ర, నక్క శోభారాణి,వారి వారి ఇళ్ల నిర్మాణం కోసం భూమి పూజ చేసారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్, టిపిసిసి ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ శంకుస్థాపన చేసారు.
ఈ కార్యక్రమంలో వారితో పాటు మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహా యాదవ్, బండి జగన్నాథం, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డాగ్ స్క్వాడ్ తో తనిఖీలు

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి మేడ్చల్**



మేడ్చల్ జిల్లా ఘట్ కేసర్ పోలీస్ స్టేషన్ పరిధి రైల్వే స్టేషన్, బస్టాండ్, సూపర్ మార్కెట్లు, గుడి, మసీద్ తదితర ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్ తో సీఐ పరశురాం బుధవారం తనిఖీలు నిర్వహించారు.సిపి సుధీర్ బాబు ఆదేశాల మేరకు ప్రతి చోట క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని సీఐ పరశురాం అన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

## మద్యం సేవించి వాహనాలు నడపవద్దు

**– మానవ తప్పిదం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి**
**– గజ్వేల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మురళి**



**గజ్వేల్ జున్ 04,కరపత్రం ప్రతినిధి**
ఇందిరా పార్క్ చౌరస్తాలో వివిధ గ్రామాల నుండి వచ్చిన వాహనదారులకు ప్రజలకు గజ్వేల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మురళి, రాంగ్ సైడ్ డ్రైవింగ్, హెల్మెట్, సీట్ బెల్ట్, సెల్ ఫోన్ డ్రైవింగ్, మరియు ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనల గురించి అవగాహన కల్పించారు ఈ సందర్భంగా గజ్వేల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మురళి మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని సూచించారు. మోటార్ సైకిల్ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని తెలిపారు. నాలుగు చక్రాల వాహనదారులు తప్పకుండా సీట్ బెల్ట్ ధరించి వాహనం నడపాలని సూచించారు. ప్రమాదం చిన్నదైనా పెద్దదైనా దాని పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని తెలిపారు. ఒక్క రోడ్డు ప్రమాదం కుటుంబాన్ని ఆర్థికంగా, మానసికంగా, శారీరకంగా, కృంగదీస్తుందన్నారు. ఇంట్లో ఇంటి యజమాని రోడ్డు ప్రమాదంలో జరగదానిది ఏదైనా జరిగితే ఆ కుటుంబం మొత్తం రోడ్డున పడే అవకాశం ఉంటుందన్నారు.మానవ తప్పిదం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రయాణికులు వాహనదారులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దన్నారు. అతివేగము రాంగ్ రూట్లో వాహనాలు నడపవద్దని తెలిపారు ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏఎస్ఐ జగదీశ్వర్, హెడ్ కానిస్టేబుల్ సాంబశివరావు, మరియు ట్రాఫిక్ సిబ్బంది వివిధ గ్రామాల నుండి వచ్చిన వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

## వేతనాలు రాక ఇబ్బంది పడుతున్న 1962 పశు ఆరోగ్యసేవ అంబులెన్స్ సిబ్బంది.




**గజ్వేల్ జున్ 04 కరపత్రం ప్రతినిధి**
నియోజకపరిధిలో మూగ జీవాలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్న 1962 అంబులెన్స్ సిబ్బందికి 3 నెలల నుండి నిధులు రాక, వేతనాలులేక ఇబ్బంది పడుతున్నారు. రాష్ఠ వ్యాప్తంగా నియోజకవర్గనికి ఒక 1962 అంబులెన్స్ ఉంటుంది. అందులో నిత్యం వెటర్నరీ డాక్టర్, ప్యారవేట్, డ్రైవర్, అటెండర్ విధులు నిర్వహిస్తుంటారు. వీరు చాలి చాలని జీతాలతో జీవనం సాగిస్తున్నరూ ఆ వచ్చే జీతాలైన 4 నెలల నుండి గౌర్మెంట్ నిధులు చెల్లించకపోవడంతో కుటుంబపోషన,పిల్లల చదువులు, ఇంటి అద్దెలు చెల్లించలేక నరకయాతన అమెనుభవిస్తున్నారు...

## 6మహిళలను మృత్యువు కబళించిన యమునా నదీ.

**– రీల్స్ చేస్తుండగా విషాదం.. ఒకే కుటుంబంలో ఆరుగురు అమ్మాయిలు మృతి..!**

**ఉత్తరప్రదేశ్ స్టేట్ కరపత్రం ప్రతినిధి**



ఒకేసారి ఫేమస్ అయిపోవాలని చిన్న పిల్లల నుంచి పెద్దవారి వరకు కూడా రీల్స్ చేస్తూ ప్రమాదకర విన్యాసాలకు పాల్పడుతున్నారు. గతంలో టిక్ టాక్ కూడా ఇలాంటి రీల్స్ చేయగా ప్రమాదాలు జరగడంతో టిక్ టాక్ ను దేశంలోనే బ్యాన్ పెట్టింది. ఇప్పుడు ఇన్ స్టాల్ లో ఫేమస్ కావాలని అనేకమంది రీల్స్ పిచ్చిలో ప్రమాదాలను తెచ్చుకుంటున్నారు.
తాజాగా రీల్స్ మోజులో ఆరుగురు అమ్మాయిలు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన ఉత్తర ప్రదేశ్ లో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం .. ఉత్తర్ ప్రదేశ్ లోని ఆగ్రా సమీపంలో నగ్లా స్వామి గ్రామానికి చెందిన ఆరు అమ్మాయిలు రీల్స్ వీడియో చేయడానికి యమునా నది దగ్గరకు వెళ్లారు. ఆ నది వారి ఇళ్లకు ఎనిమిది వందల మీటర్ల దూరంలోనే ఉంది. ఆరుగురు అమ్మాయిలు ఒకరి చెయ్యి ఒకరు పట్టుకుని నదిలోకి దిగారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో జాప్యం తగదు

- దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షు మామిడి సోమయ్య డిమాండ్






**కరపత్రం ప్రతినిధి జనగామ:**
జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం మరింత జాప్యం చేయడం తగదని, దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా... జర్నలిస్టుల సమస్యలను ఇంత వరకు పరిష్కరించలేదని ధ్వజమెత్తారు.ప్రభుత్వ జాప్యాన్ని నిరసిస్తూ,సమస్యల పై సమిష్టి పోరాటానికి జర్నలిస్టులు సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం జనగామలోని పూసల భవన్ లో జరిగిన టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా మహాసభ సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ...రాష్ట్రంలో మెజారిటీ జర్నలిస్టుల జీవన పరిస్థితులు దయనీయంగా మారుతున్నాయని, ముఖ్యంగా గ్రామీణ విలేకరుల పరిస్థితి అధ్వాన్నంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం పదేళ్లు జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకుండా ద్రోహం చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తుందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రెండు జర్నలిస్టు సంఘాలు పాలకుల పక్షాన నిలిచి జర్నలిస్టుల సమస్యలను విస్మరించాయని ఆయన విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత జర్నలిస్టులకు ఏం ఒరిగిందని, ఏం మేలు చేశారని సంబరాలు జరుపుకుంటున్నారని ప్రశ్నించారు. చెట్టుపేరు చెప్పి కాయలమ్ముకున్నట్టు జర్నలిస్టుల పేరు చెప్పి అధికార పదవులు పొంది పాలకులకు ఊడిగం చేస్తూ జర్నలిస్టులకు అన్యాయం చేస్తున్నారని దుయ్యబట్టారు.
అలాంటి జర్నలిస్టు సంఘాల పట్ల యావత్ జర్నలిస్టులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఇత ప్రభుత్వం నుంచి జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వలేదని, చాలా ఏళ్ళుగా నడుస్తున్న అనేక చిన్న పత్రికలను ప్రభుత్వం గుర్తించకుండా అణచివేస్తున్నదని మామిడి సోమయ్య ఆందోళన వ్యక్తం చేశారు. అర్హత ఉన్న అన్ని చిన్న పత్రికలను ఎంపానల్మెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా కొత్త అక్రెడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు వెంటనే జారీ చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఇతర సంఘాల నుంచి పెద్దఎత్తున టీడబ్ల్యూజేఎఫ్ లో చేరుతున్నారని చెప్పారు. రాబోయే రెండు మాసాల్లో అన్ని జిల్లా మహాసభలు పూర్తి చేసి పెద్ద ఎత్తున రాష్ట్ర మహాసభ నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి విజయ్ కుమార్, వల్లాల జగన్ మాట్లాడుతూ, ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఫెడరేషన్ ను బలోపేతం చేయాలని కోరారు. టీడబ్ల్యూజేఎఫ్ సంఘం జర్నలిస్టుల సమస్యలపై నిరంతం పోరాడుతూ, జర్నలిస్టులకు అండగా ఉంటుందని వారన్నారు.విలేకరులు పాలకుల ముందు తలవంచకుండా స్వతంత్రంగా వ్యవహరించాలని అన్నారు. జనగాం జిల్లా మహాసభలు త్వరలో విజయవంతంగా జరపాలని కోరారు. సీనియర్ జర్నలిస్టు నీల నరేష్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీనియర్ జర్నలిస్టులు నవీన్ చారి, కృష్ణమూర్తి, కరుణాకర్, పరశురాములు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు నూతనంగా ఫెడరేషన్ సభ్యత్వం తీసుకున్నారు.
సన్నాహక కమిటీ ఏర్పాటు...తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) జనగామ జిల్లా సన్నాహక కమిటీ ఏర్పడింది. ఈ కమిటీలో తొమ్మిది మంది సభ్యులున్నారు.నీల నరేష్ బాబు(మెట్రో),గూడూరు లెనిన్(ప్రజాజ్యోతి),చింతకింద కృష్ణమూర్తి (వరంగల్ వాయిస్),బొడ్డు రంజిత్ (జనంసాక్షి),గూడూరు కరుణాకర్ (తెలంగాణ ముచ్చట్లు),కందుల నర్సింగరావు (జనం), వేముల నర్సింగం(జ్యోతి),కుచన సుప్రీం(టీ ఛానెల్), గోవర్ధన్ (దిశ) తదితరులు సన్నాహక కమిటీలో ఉన్నారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా సభ్యత్వ నమోదు పూర్తి చేసి జిల్లా మహాసభ జరపాలని సమావేశం తీర్మానించింది.

# కష్టపడి పనిచేయండి.. విజయం ఖచ్చితంగా వస్తుంది

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం, తెలంగాణ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సమంత
- ఎన్టీపీసీ రామగుండంలో ముగిసిన గర్ల్ ఎంపవర్‌మెంట్ మిషన్
- విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రదానం








**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిది**
అంకితభావంతో ఉండండి.. కష్టపడి పనిచేయండి.. విజయం ఖచ్చితంగా వస్తుందనీ జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం, తెలంగాణ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సమంత అన్నారు. ఎన్టీపీసీ పీటీఎస్ లోని కాకతీయ హాల్ లో గర్ల్ ఎంపవర్‌మెంట్ మిషన్ - 2025 ముగింపు వేడుకలను బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథి, కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్, పెద్దపల్లి శ్రీ కోయ శ్రీహర్ష, గౌరవ అతిథి, రామగుండం, తెలంగాణ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, చందన్ కుమార్ సమంత, దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు రాఖీ సమంత, సెంట్రల్ ఎన్సీసీ సభ్యులు బాబర్ సలీం పాషా, ఇతర ప్రముఖులు దీపం వెలిగించి ఆర్ట్ ఎగ్జిబిషన్ ను ప్రారంభించారు. బాలిక సాధికారత మిషన్ సారాంశాన్ని సంగ్రహించే ప్రత్యేకంగా రూపొందించిన మ్యూజిక్ వీడియోను ప్రారంభించారు. నృత్య ప్రదర్శనలు, కరాటే ప్రదర్శనలు, యోగా ప్రదర్శనలు, ప్రసంగాలు, బేటీ బచావో, బేటీ పఢావో శక్తివంతమైన సందేశం చుట్టూ కేంద్రీకృతమై ఉన్న ఆలోచింపజేసే స్కిట్‌తో కూడిన సాంస్కృతిక కార్యక్రమాన్ని ప్రదర్శించారు. వారి ప్రదర్శనలు నిజంగా మొత్తం కార్యక్రమానికి ఆకర్షణగా నిలిచాయి. దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు రాఖీ సమంత మాట్లాడుతూ యువతులు అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉన్నారని, సరైన మద్దతుతో భవిష్యత్ నాయకులు, వైద్యులు, ఐఏఎస్ అధికారులు, ఉపాధ్యాయులు, సంభాషణకర్తలుగా మారగలరని అన్నారు. ప్రాజెక్ట్ హెడ్ (ఎన్టీపీసీ రామగుండం, తెలంగాణ) చందన్ కుమార్ సమంత, 28 రోజుల రెసిడెన్షియల్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న 120 మంది బాలికలలో కనిపించిన పురోగతి, పరివర్తన పట్ల తీవ్ర గర్వాన్ని వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ గర్ల్ ఎంపవర్‌మెంట్ మిషన్ (జెమ్) వర్క్‌షాప్ -2025 ను ప్రశంసించారు. వివిధ ప్రభావవంతమైన కార్యక్రమాల ద్వారా సమాజ సమగ్ర అభ్యున్నతికి సంస్థ చేస్తున్న నిరంతర ప్రయత్నాలను కూడా ఆయన ప్రశంసించారు. 28 రోజుల్లో నేను మీలో చూస్తున్న పరివర్తన గొప్పదని, మీ కళ్ళలోని విశ్వాసం, మీరు వేదికపై మిమ్మల్ని మీరు మోసే విధానం ఈ వర్క్‌షాప్ సమయంలో ఇచ్చిన విలువైన అభ్యాసాలను ప్రతిబింబిస్తాయనీ, కానీ గుర్తుంచుకోండి, ఇది ప్రారంభం మాత్రమే.. ముందుకు సాగే మార్గం చాలా పొడవుగా ఉందన్నారు. అనంతరం ముఖ్య అతిథి, ఇతర ప్రముఖులు అన్ని బాలికలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ వర్క్‌షాప్‌లో ఇంగ్లీష్, హిందీ, గణితం, సైన్స్, కంప్యూటర్ అక్షరాస్యత వంటి విద్యా విషయాలపై నిర్మాణాత్మక సెషన్‌లు, అలాగే జీవిత నైపుణ్యాలు, నృత్యం, కరాటే, యోగా, ఆరోగ్య అవగాహనపై దృష్టి సారించిన కార్యకలాపాలు ఉన్నాయి. ప్రత్యేక నిపుణుల నేతృత్వంలోని సెషన్‌లు ఋతు పరిశుభ్రత, పోషకాహారం, వ్యక్తిగత భద్రత, సమయ నిర్వహణ, కెరీర్ అవగాహన వంటి ముఖ్యమైన అంశాలను కవర్ చేశాయి. జీఎంలు, హెచ్ఓహెచ్ఆర్, హెచ్ఓడీలు, డీఎంఎస్ సీనియర్ సభ్యులు, యూనియన్, అసోసియేషన్ల ప్రతినిధులు, సీఐఎస్ఎస్, జెమ్ గర్ల్స్ వారి తల్లిదండ్రులు, ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పెద్దపల్లి పార్లమెంట్ అభివృద్ధికి ఎంపీ వంశీకృష్ణ కృషి

- ఎంపీగా ఏడాది పూర్తయిన సందర్భంగా కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిది**



పెద్దపల్లి పార్లమెంట్ ప్రాంత అభివృద్ధికి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఎనలేని కృషి చేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ లీడర్ పి.మల్లికార్జున్ తెలిపారు. ఎంపీగా ఎన్నికై ఏడాది పూర్తయిన సందర్భంగా గోదావరిఖనిలో కాంగ్రెస్ లీడర్ కామ విజయ్ ఆధ్వర్యంలో సంబరాలు చేశారు. గోదావరిఖని మెయిన్ చౌరస్తాలో బాణాసంచా కాల్చి, అనంతరం పేదలకు స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ ఎంపీ వంశీకృష్ణ పార్లమెంట్ పరిధిలోని అనేక ప్రజా సమస్యలపై పోరాడుతూ వారి సంక్షేమం కోసం పనిచేస్తున్నారని తెలిపారు. సింగరేణి రిటైర్డ్ కార్మికులకు పెన్షన్ పెరుగుదల కోసం సీఎంపీఎఫ్ ట్రస్ట్ బోర్డుకు ప్రతి టన్ను బొగ్గుపై అదనంగా రూ.10 జమ చేసేలా చొరవ తీసుకున్నారని చెప్పారు. కార్మికులకు ఆదాయపు పన్ను మినహాయింపు చేయాలని పార్లమెంట్లో గళమెత్తిన యువనాయకుడని కొనియాడారు. పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, ఓదెల, తదితర రైల్వే స్టేషన్లలో పలు రైళ్ళ నిలుపుదలకు ఎంపీ కృషి చేశారని పేర్కొన్నారు. గతంలో కన్నా మరింత ఎక్కువగా అభివృద్ధి కార్యక్రమాలకు యువ ఎంపీ వంశీకృష్ణ శ్రీకారం చుడుతున్నారని, పార్లమెంట్ ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలుపుతున్నట్టు మల్లికార్జున్ తెలిపారు. ఈ కార్యక్రమంలో లీడర్లు రాచకొండ కోటేశ్వర్లు, మల్లేష్ యాదవ్, హకీం, కోరం నరేందర్ రెడ్డి, రౌతు శ్రీకాంత్, కుమార్, నగేష్, రాజు, చారి, ముచ్చకుర్తి మహేష్, సర్దార్, తదితరులు పాల్గొన్నారు.

# కానిస్టేబుల్స్ ను సిపి ఆఫీసుకు అటాచ్ చేయడం చర్యగా భావించము




- బత్తుల మహేందర్ అన్యాయం జరగడం పై దళిత ప్రతినిధులు సమావేశం
- ఎస్సై కానిస్టేబుల్ లపై సస్పెన్షన్ వేటు వేయాలి - దళిత సంఘాల ఐక్యవేదిక డిమాండ్

**కరపత్రం ప్రతినిధి హుజూరాబాద్ జూన్ 4**
హుజురాబాద్ పట్టణంలో వివిధ దళిత సంఘాల నాయకులు, న్యాయవాదులు బత్తుల మహేందర్ సంఘటన పై సమావేశం కావడం జరిగింది బత్తుల మహేందర్ పై ఎస్సై భార్గవ్ కానిస్టేబుల్స్ కొట్టిన వీడియోలు బయటికి వస్తే పోలీస్ శాఖ చర్యలు తీసుకున్నట్టు కానిస్టేబుల్స్ ను అటాచ్ చేయడం చాలా బాధాకరం వారిపై సస్పెన్షన్ వేటి వేయకుండా కేసులు నమోదు చేయకుండా బదిలీ చేయడం సరికాదు నిర్మల్ లో ఒక రైతును ఈడ్చిక వెళ్లిన ఏ ఎస్ ఐ 24 గంటలు గడవకముందే ఆ జిల్లా ఎస్పీ సస్పెండ్ చేయడం జరిగింది 20 రోజులు గడిచినా కూడా అనేక ఫిర్యాదులు చేస్తున్న కూడా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బదిలీ చేసి చర్యలుగా భావిస్తే ఎలా అని ఈ సందర్భంగా అడుగుతున్నాం జిల్లా సిపి పై పూర్తిస్థాయిలో నమ్మకం ఉంది కాబట్టే ఇప్పటివరకు ఎలాంటి ఉద్యమాలు చేయలేదని దళిత సంఘాల నమ్మకాన్ని వమ్ము చేయకూడదని స్పష్టం చేస్తున్నాం సి పి ఒక పత్రికా ప్రకటన చేస్తూ విధులకు ఆటంకం కల్పిస్తే మహేందర్ పై కేసు నమోదు చేశామని చెప్పారు కానీ మహేందర్ ను కొడితే ఏ కేసు నమోదు చేశారో చెప్పాలని అడుగుతున్నాము పోలీసులకు చట్టం వర్తించవా ? ఈ సందర్భంగా అడుగుతున్నాం పోలీసు ఉన్నతాధికారులు ఇప్పటికైనా సస్పెన్షన్ చేయాలని లేనియెడల జిల్లా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేస్తున్నాము ఈ సమావేశంలో టిపిసిసి ఎస్సీ డిపార్ట్మెంట్ అట్రాసిటీ రాష్ట్ర ఇంచార్జ్ సంపత్, ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు రుద్రారపు రామచంద్రం మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ ఇంజన్ వెంకట్ స్వామి మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి, మరపల్లి శ్రీనివాస్ మాదిగ,ఎం ఎస్ పి జిల్లా అధ్యక్షులు తునికి వసంత్ మాదిగ, మాజీ బార్ ప్రెసిడెంట్, మాజీ ఏ జి పి అందె వెంకటేశ్వర్లు, సీనియర్ న్యాయవాది కొత్తూరి రమేష్, టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్ జీడి రవితేజ, న్యాయవాది శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు

# పండుగలను అందరు సంతోషంగా, ప్రశాంతంగా జరుపుకోవాలి

- పెద్దపల్లి డీసీపీ కర్ణాకర్
- రాబోవు బక్రీద్ సందర్భంగా పీస్ కమిటీ మీటింగ్ నిర్వహణ






**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిది**
పండుగలను అందరు సంతోషంగా, ప్రశాంతంగా జరుపుకోవాలనీ పెద్దపల్లి డీసీపీ కర్ణాకర్ సూచించారు. రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు రాబోయే బక్రీద్ సందర్భంగా గోదావరిఖని ఏసీపీ పర్యవేక్షణలో గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో గోదావరిఖని వన్ టౌన్, గోదావరిఖని టూ టౌన్, రామగుండం సర్కిల్ పరిధిలోని ముస్లిం, హిందూ, క్రిస్టియన్ మత పెద్దల తో శాంతి సమావేశం (పీస్ కమిటీ) ఏర్పాటు చేశారు. సమావేశం కు పెద్దపల్లి డీసీపీ పి.కర్ణాకర్ ముఖ్య అతిథులుగా హాజరై హిందూ, ముస్లిం మత పెద్దలతో మాట్లాడి పోలీసుల తరుపున సూచనలు, సలహాలను తప్పకుండా పాటించాలని డీసీపీ కోరారు. గోదావరిఖని సబ్ డివిజన్ పరిధిలో హిందూ ముస్లిం సోదరులు అన్నదమ్ముల వలె కలిసిమెలిసి ముందుకు వెళుతున్నారని తెలిపారు. ఆయా మతస్తులు పండుగ సందర్భాల్లో అందరు కలిసి కుటుంబ సభ్యులుగా పాల్గొంటున్నట్లు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ బక్రీద్ సందర్భంగా పశువుల రవాణాలను అనుమతి లేకుండా వెటర్నరీ డాక్టర్ సర్టిఫికెట్ లేకుండా ఎటువంటి ఆవుల రవాణా చేయకూడదని, పశువుల కాళేబరాలను, పశువుల వ్యర్థాలను బయట పడేయకుండా మున్సిపాలిటీ వారు ఏర్పాటు చేసే డిస్పోజల్ వాహనాలు, కవర్ లలో మాత్రమే వేయాలన్నారు. కొంతమంది యువత బక్రీద్ సందర్భంగా అతి ఉత్సాహంతో సోషల్ మీడియాలో వదంతులు ప్రచారం చేసి అల్లర్లు గొడవలు పాల్పడే విధంగా కార్యకలాపాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లఘించి ఆవులు, లేగదూడలను అమ్మినట్లయితే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో గోదావరిఖని ఏసిపి ఎం.రమేష్, గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, గోదావరిఖని టూ టౌన్ ఇన్స్పెక్టర్ ప్రసాదరావు, రామగుండం సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, గోదావరిఖని టౌన్ ఎస్ఐలు రమేష్, భూమేష్, ఎన్టిపిసి ఎస్ఐ ఉదయ్ కిరణ్, రామగుండం ఎస్సై సంధ్యారాణి, హిందూ ముస్లిం క్రిస్టియన్ మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.